సమస్యల పరిష్కారానికి కృషి

లాలమ్మగార్డెన్స్ కాలనీలో పర్యటించిన బీఆర్ఎస్ నాయకులు

మణికొండ, ఏప్రిల్ 4 : మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట 'ప్రజా సమస్యలు – ప్రజాభిప్రాయ సేకరణ' కార్యక్రమం శుక్రవారం పుప్పాలగూడ లాలమ్మ గార్డెన్స్ కాలనీలో నాయకులు పర్యటిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీవాసులు అనేక సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చి తక్షణమే పరిష్కరించేలా చొరవ చూపాలని కోరారు.

లాలమ్మ గార్డెన్ కాలనీలో సమస్యలు

ఈ మధ్యకాలంలో పెరిగిన ఇంటి పన్ను విధానాన్ని ప్రతి ఒక్కరూ ప్రశ్నిస్తున్నారు. కొంతమందికి ఆస్తిపన్ను పెంచి మరి కొంతమందికి పెంచక పోవడం విడ్డూరమని ప్రశ్నించారు, అడిగితే మున్సిపాలటీ అధికారుల నుంచి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తిపన్ను కట్టడానికి ఎవరూ వ్యతిరేకం కాదు కానీ పెంచిన విధానాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని దాని పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. అదేవిధంగా షేక్ పేట నుంచి పుప్పాలగూడ మీదగా వెళ్లే ఆర్టీసీ బస్సులు బస్టాండ్ వద్ద నిలుపుతున్నారు కానీ పుప్పాలగూడ మీదుగా షేక్‌పేట వైపు వెళ్లే బస్సులను ఆపడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా స్థానికులు తెలిపిన సమస్యలను గుర్తించిన బీఆర్ఎస్ నాయకులు లాలమ్మ గార్డెన్స్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా తమ వంతుగా కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, అందే లక్ష్మణ్ రావు, బుద్ధోలు బాబు, సంఘం శ్రీకాంత్, గోరుకంటి విఠల్, శ్రీనివాస్ చారి, దిలీప్, యాలాల కిరణ్, భాను చందర్, సుమనళిని, బొడ్డు శ్రీధర్, తిరుపతి, బాలాజీ, రాజు పాల్గొన్నారు.

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని లాలమ్మ గార్డెన్స్ కాలనీలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎర్రగడ్డ, ఏప్రిల్ 4: ఎర్రగడ్డ పరిధిలో శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బోరబండ ప్రాంతంలోని వినాయకరావు నగర్, ఎస్సార్టీ నగర్, ఇందిరానగర్ ఫేస్ 1, భారత్ నగర్, రాజ్‌నగర్ బస్తీలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ చరణ్‌సింగ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు దివ్యాంగులకు ఉచిత స్క్రీనింగ్ శిబిరం

హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

హిమాయత్ నగర్ ,ఏప్రిల్ 4: జీవితం మధ్యలో ప్రమాదవ శాత్తు ఏదైనా అవయవం కోల్పోయి దివ్యాంగులుగా మారిన వారు ఇబ్బందులు పడవద్దనే సంకల్పంతో ఈ నెల 6న చంపాపేట్ లోని మినర్వా గార్డెన్‌లో ఉచితంగా స్క్రీనింగ్, డయాగ్నోస్టిక్, ఆర్టిఫిషియల్ లింబ్,కాలిఫర్స్, కొలతల శిబిరం నిర్వహిస్తున్నట్లు నారాయణ్ సేవా సంస్థాన్ కో– ఆర్డినేటర్ అల్కా చౌదరి, ప్రతినిధులు జస్మిత్ పటేల్, భగవాన్ ప్రసాద్ గౌర్, రితేష్ జగీర్దార్, మహేందర్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ చేతులు,కాళ్లు కోల్పోయి దివ్యాంగులుగా మారి దుర్భర జీవితం నుంచి విముక్తి కల్పించేందుకే ప్రత్యేకంగా ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరంకు వచ్చే వారు ఆధార్ కార్డు, వైకల్య ధృవీకరణ పత్రం, వైకల్యాన్ని తెలిపే రెండు ఫొటోలు తప్పనిసరిగ్గా తీసుకురావాలని సూచించారు. వివరాల కోసం 70235 09999ను నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ స్కూళ్లను ప్రోత్సహించాలి

అడ్డగుట్ట, ఏప్రిల్ 4: ప్రభుత్వ స్కూళ్లను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. చిలకలగూడ దూద్‌బావిలోని ప్రాథమిక పాఠశాలలో రానున్న విద్యా సంవత్సరానికి ప్రవేశాల కరపత్రాలను మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీతతో కలిసి శుక్రవారం ఆయన తన నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్‌లో విద్యార్థులకు ఉపకరించేలా జూనియర్, డిగ్రీ కాలేజీలను సాధించుకున్నామన్నారు.

బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్ల గురించి చర్చించేందుకు శుక్రవారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఏర్పాటు చేసిన సమావేశం సందర్భంగా హైద్రాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. మాగంటి గోపీనాథ్ ఆరోగ్యం గురించి కేసీఆర్ వాకబు చేశారు. అనారోగ్యం నుంచి పూర్తిగా కోలుకున్నానని మాగంటి తెలిపారు. – బంజారాహిల్స్, ఏప్రిల్ 4

జంక్షన్ అభివృద్ధికి సహకరించాలి

నిర్వాసితులతో మాట్లాడుతున్న ఏసీపీ ప్రసీద,పాల్గొన్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

జూబ్లీహిల్స్,ఏప్రిల్ 4: యూసుఫ్‌గూడ సర్కిల్‌లోని రహమత్‌నగర్ డివిజన్ జంక్షన్ అభివృద్ధికి జీహెచ్ఎంసీ అధికారులు కార్యాచరణ ప్రారంభించారు. ఇప్పటికే ఆక్రమణలు తొలగించిన అధికారులు శుక్రవారం స్థానికులతో సమావేశం నిర్వహించారు. యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రసీద అధ్యక్షతన కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి సమక్షంలో రోడ్డు విస్తరణలో నష్టపోతున్న వారితో చర్చలు నిర్వహించారు. రహమత్ నగర్ జంక్షన్ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన రోడ్డు విస్తరణలో ప్రభుత్వ ఆస్తులను మినహాయించి 8 మంది ప్రైవేట్ వ్యక్తులు తమ ఇళ్లు, స్థలాలు నష్టపోతున్నారు. జంక్షన్ అభివృద్ధి కోసం తమ స్థలాలు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్న ఆయా నిర్వాసితులు తగిన నష్టపరిహారం చెల్లించాలని కోరారు. నష్టపరిహారం చెల్లించిన తరువాతనే జంక్షన్ అభివృద్ధి పనులు చేపడతామని ఏ సీపీ ప్రసీద తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ నరేష్ పాల్గొన్నారు.

కలాశ జ్యూవెల్లరీ సరికొత్త బ్రైడల్ కలెక్షన్స్

బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10 లోని ప్రతిష్టాత్మకమైన జ్యూవెల్లరీ సంస్థ కలాశ 8వ వార్షికోత్సవం వేడుకలు శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెళ్లికూతురు పేరుతో సరికొత్త బ్రైడల్ కలెక్షన్‌ను ఆవిష్కరించారు.కలాశ డైరెక్టర్ శ్రీనివాస్ చందా, అషికా చందా తదితరులు పాల్గొన్నారు. – బంజారాహిల్స్, ఏప్రిల్ 4:

ముగిసిన ఎన్ఎస్ఎస్ క్యాంప్

విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ ఓ.పద్మజ

ముషీరాబాద్, ఏప్రిల్ 4: విద్యానగర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు ముగిసింది. వారం రోజులపాటు మేడ్చల్ మండలం నూతనకల్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహించారు. ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ ఓ.పద్మజ ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ క్యాంప్‌లో పాల్గొని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చెట్ల ఆవశ్యకతను నినాదాల రూపంలో గ్రామ ప్రజలకు తెలియజేయడమే కాకుండా స్వయంగా మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వాడకం, డ్రగ్స్ వలన సమాజానికి జరుగుతున్న నష్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభు ఎన్ఎస్ఎస్ బృందాన్ని అభినందించారు. విద్యార్థులు బాధ్యత గల పౌరులుగా తయారు అయినప్పుడే బాధ్యతగల సమాజం, దేశం తయారవుతుందని ఆయన పేర్కొన్నారు.

జోయాలుక్కాస్‌లో.. బ్రిలియన్స్

డైమండ్ జ్యూవెల్లరీ షో

ప్రపంచంలోనే ప్రముఖ జ్యూవెల్లరీ అయిన జోయాలుక్కాస్ శుక్రవారం పంజాగుట్టలో బ్రిలియన్స్ డైమండ్ జ్యూవెల్లరీ షో నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నటి రాశీసింగ్, డీజీఎం రాజేష్ కృష్ణన్ తదితరులు హాజరయ్యారు. – సిటీబ్యూరో, ఏప్రిల్4, (నమస్తే తెలంగాణ)

ఎమ్మెల్యేకు సీతారాముల కల్యాణ ఆహ్వానం

బేగంపేట్, ఏప్రిల్ 4: సీతారాముల కల్యాణ మహోత్సవానికి రావాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు సనత్ నగర్ హనుమాన్ ఆలయ పండితులు కార్పొరేటర్ కొలన్ లక్ష్మి ఆధ్వర్యంలో ఆహ్వానించారు. శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఈ నెల 6 న నిర్వహించే కార్యక్రమ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాదం అందజేశారు. అదేవిధంగా జెక్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు సుబ్బరాజు, సురేష్ గౌడ్ పాల్గొన్నారు.

'లయన్ నేషనల్' అవార్డులకు నామినేషన్ల ఆహ్వానం

ఖైరతాబాద్, ఏప్రిల్ 4 : ఎడ్యుకేషనల్ రీసెర్చ్, సేవా సంస్థ ఎడ్యుగేట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారికి 'లయన్ నేషనల్ అవార్డుల' కోసం నామినేషన్లను ఆహ్వానిస్తోంది. విద్య, వైద్యం, బ్యాంకింగ్, ఫైనాన్స్, నిర్మాణం, రియల్ఎస్టేట్, పర్యాటకం, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఎనర్జీ, మొబైల్ అండ్ టెలికమ్యూనికేషన్, వ్యవసాయ రంగాల్లో విశిష్ట సేవ లందిస్తున్న వారిని ఈ అవార్డుకు ఎంపిక చేస్తామని నిర్వహణ కమిటీ కో ఆర్డినేటర్ మాన్విత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మే 15 నామినేషన్లను పంపాలని, అదే నెలా 31న హైదరాబాద్‌లో జరిగే జాతీయ పారిశ్రామిక సదస్సులో అవార్డులను అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు https:// edugatefoundation.com వెబ్ సైట్ ను సంప్రదించాలన్నారు.

తైబజార్ వసూలు.. చట్ట విరుద్ధం

– ద సిటిజన్ కౌన్సిల్ సభ్యులు



మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్‌కు సమస్యను వివరిస్తున్న ద సిటిజన్ కౌన్సిల్ ప్రతినిధులు

మణికొండ, ఏప్రిల్ 4 : మణికొండ మున్సిపాలిటీ పరిధిలో చిరు వ్యాపారుల నుంచి తైబజార్ పేరిట వసూలు చేయడం విరుద్ధమని ద సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తక్షణమే చిరు వ్యాపారుల వద్ద నుంచి తైబజార్ వసూళ్లను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. వీధి వ్యాపారుల జీవనోపాధి సరళంగా సాగడానికి అనుకూలంగా భారత పార్లమెంట్ యాక్ట్ 2014 లో అమలు చేయగా ఆ చట్టానికి పూర్తి మద్దతుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా 2020 జూన్ 10న ప్రభుత్వం ఆర్డర్ 89 ను విడుదల చేయడం జరిగిందని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ది సిటిజన్స్ కౌన్సిల్ ముఖ్య కార్యదర్శి షేక్ ఆరీఫ్ మహమ్మద్, ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు, కార్యదర్శి ఉపేందర్‌నాథ్‌రెడ్డి ,కోశాధికారి దిలీప్ కక్కడ్, కమిటీ సభ్యులు బొడ్డు శ్రీధర్, సుమనళిని పాల్గొన్నారు.

ప్రయాణికులు బస్‌షెల్టర్లను ఉపయోగించుకోవాలి

నార్త్ జోన్ ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి

బొల్లారం చెక్‌పోస్ట్ వద్ద బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, ఏసీపీ శంకర్ రాజు, సీఐ మధుబాబు

బొల్లారం, ఏప్రిల్ 4: కంటోన్మెంట్ పరిధిలోని బొల్లారం చెక్‌పోస్ట్ వద్ద మార్పు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్‌ను శుక్రవారం నార్త్ జోన్ ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, ఏసీపీ శంకర్ రాజు, సీఐ మధుబాబుతో కలిసి ప్రారంభించారు. అదనపు డీసీపీ మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికుల కోసం బస్‌షెల్టర్ ఎంతో ఉపయోగకారంగా ఉంటుందని అన్నారు. బస్ షెల్టర్లలోనే ప్రయాణికులు ఉండాలని, రోడ్డుపై నిలుచోకూడదని సూచించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధుల కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్, హకీంపేట్ బస్‌డిపో మేనేజర్ భవభూతి, ఫౌండేషన్ ఫౌండర్ రఘువంశీ, కోఫౌండర్ రాఘ వైష్ణవి, కిరణ్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాస్'

దరఖాస్తుల స్వీకరణ

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 4 : ఈ నెల 14 వరకు రాజీవ్ యువ వికాస్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాలను ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు వారికి స్వయం ఉపాధి అవకాశాలు పెంచడం కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకానికి లబ్ధిదారుల నుంచి ఆన్ లైన్ దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 14 వరకు అవకాశం ఉందన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డులతో పాటు కొత్తగా మున్సిపాలిటీలో విలీనం చేసిన ఘాన్సిమియాగూడ, శంకరాపూర్, చిన్నగోల్కొండ, పెద్దగోల్కొండ, బహదూర్‌గూడ, హ మిదుల్లానగర్, రషీద్‌గూడ గ్రామాలకు చెందిన వారుసైతం దరఖాస్తు చేసుకున్న కాఫీలను మున్సిపాలిటీ కార్యాలయంలో అందజేయాల న్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న

నిందితులు అరెస్ట్

హిమాయత్ నగర్, ఏప్రిల్4: ఆన్ లైన్ లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను సౌత్ , ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం అరెస్టు చేసింది. టాస్క్‌ఫోర్స్ డీసీపీ అందే శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం హిమాయత్ నగర్ ప్రాంతంలో నివాసం ఉండే గురువిందర్ సింగ్ , సర్దార్ జస్విందర్ సింగ్ , కొప్పుల కార్తీక్‌లు బెట్టింగ్‌లకు అలవాటు పడ్డారు. ఐపీఎల్ ప్రారంభం కావడంతో కాచిగూడకు చెందిన వికాస్ , ముఖేష్ అనే మెయిన్ బుకీలతో యూజర్ ఐడీలు తీసుకొని రాధే ఎక్స్చేంజ్ . కామ్ బెట్టింగ్‌లను నిర్వహిస్తున్నారు. విశ్వనీయ సమాచారం మేరకు ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి నగదు మొత్తం రూ. 1,32,400 , మూడు సెల్ ఫోన్లను సీజ్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి , రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ అందే శ్రీనివాసరావు తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును నారాయణ గూడ పోలీసులకు అప్పగించారు.

పాత గ్రేడింగ్‌లోనే.. పది ఫలితాలు ప్రకటించాలి

విద్యాశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న శేఖర్ రెడ్డి, మల్లారెడ్డి తదితరులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 4 :పదో తరగతి ఫలితాలను పాత గ్రేడింగ్ పద్ధతిలోనే విడుదల చేయాలని తెలంగాణ బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శేఖర్ రెడ్డి , మల్లారెడ్డి లు రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం లక్డీకపూల్‌లోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రేడింగ్ పద్ధతిని ఎత్తివేసి మార్కులు ఇవ్వడం వల్ల కార్పొరేట్ స్కూల్స్ కు లబ్ధి చేకూరుతుందన్నారు. గ్రేడింగ్ పద్ధతిలో 90 నుంచి వంద మార్కులు వచ్చిన వారికి ఒకే 10 జీపీఏగా చూపించే వారని... ఇప్పుడు మార్కుల రూపంలో వేస్తే విద్యార్థులు మానసికంగా కుంగిపోతారన్నారు. ప్రభుత్వం స్పందించి పాత పద్ధతిలోనే గ్రేడింగ్ రూపంలో ఫలితాలను వెల్లడించాలన్నారు.

19న పంచాయతీ కార్మికుల సమ్మె

సమ్మె నోటీసు పత్రాన్ని ఎంపీడీవోకు అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 4 : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పంచాయతీ కార్మికుల సంఘం నాయకుడు పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం శంషాబాద్ మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన కార్మికులతో కలిసి శంషాబాద్ ఎంపీడీవో మున్నికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకుడు పవన్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించ లేకపోయింది. ప్రతి కార్మికుడికి రూ. 21వేల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుడిని పర్మినెంట్ చేసి వారికి ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. దీంతో పాటు ప్రతి కార్మికుడి పేరున 5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికుడు చనిపోతే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19న జరిగే సమ్మెను విజయవంతం చేయడం కోసం పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు సహకరించాలని కోరారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న

నిందితులు అరెస్ట్

హిమాయత్ నగర్, ఏప్రిల్4: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను సౌత్ , ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం అరెస్టు చేసింది. టాస్క్‌ఫోర్స్ డీసీపీ అందే శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం హిమాయత్ నగర్ ప్రాంతంలో నివాసం ఉండే గురువిందర్ సింగ్ , సర్దార్ జస్విందర్ సింగ్ , కొప్పుల కార్తీక్‌లు బెట్టింగ్‌లకు అలవాటు పడ్డారు. ఐపీఎల్ ప్రారంభం కావడంతో కాచిగూడకు చెందిన వికాస్ , ముఖేష్ అనే మెయిన్ బుకీలతో యూజర్ ఐడీలు తీసుకొని రాధే ఎక్స్చేంజ్ . కామ్ బెట్టింగ్‌లను నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి మొత్తం రూ. 1,32 వేల నగదు , మూడు సెల్ ఫోన్లను సీజ్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి , రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ అందే శ్రీనివాసరావు తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును నారాయణ గూడ పోలీసులకు అప్పగించారు.

ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బన్సీలాల్‌పేటలో ఇండ్లలోకి ప్రవేశించిన వర్షం నీరు

బేగంపేట్, ఏప్రిల్ 4: నగరంలో కురిసిన భారీ ఆకాల వర్షంతో సనత్నగర్ నియోజకవర్గంలోని ముంపు ప్రాంతాలు అతలాకుతలంగా మారా యి. ఆయా ప్రాంతాల్లో అధికారులు తక్షణ చర్యలు చేపట్టి స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మాజీ మంత్రి సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ ఆదేశించారు.

బేగంపేట్, బన్సీలాల్పేట్, మోండా ప్రాంతాల్లోని ఇండ్లలోకి వర్షం నీరు చేరింది. దీంతో స్థానికులు అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ముందస్తు ప్రణాళికతో మరోసారి నీరు చేరకుండా చూడాలని చెప్పారు. ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.

కల్లు దొరకలేదని....

వ్యక్తి ఆత్మహత్య

ఖైరతాబాద్, ఏప్రిల్ 4 : కల్లుకు బానిసగా మారిన ఓ వ్యక్తి సమయానికి దొరక్కపోవడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలోని నిమ్స్ దవాఖానలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన హనుమాండ్ల పోషం (80) కొంత కాలంగా సెప్సిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నెల 1న ఆయన కొడుకు హనుమాండ్ల నారాయణ (55), మధుకర్‌లు తండ్రిని నిమ్స్‌లో చేర్పించారు. ప్రస్తుతం సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో చికిత్స అందిస్తున్నారు. కాగా, కల్లుతాగే అలవాటు ఉన్న నారాయణ శుక్రవారం దాని కోసం ప్రయత్నించగా దొరకలేదు. దీంతో తీవ్ర మానసిక ఆందోళనకు గురై రెండో అంతస్తులోని స్పెషాలిటీ, ఎమర్జెన్సీ బ్లాక్ మధ్య ఉన్న ర్యాంప్ బ్రిడ్జిపై నుంచి కిందకు దూకాడు. తలకు తీవ్ర గాయం కాగా, ఎమర్జెన్సీలో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. కాగా, అదేరోజు రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని వృద్ధుడు ఆత్మహత్య

బండ్లగూడ, ఏప్రిల్ 4: కుటుంబ కలహాలతో ఓ వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుద్వేల్ గ్రామానికి చెందిన మహమూద్ (50) రాజేంద్రనగర్ పశువైద్య విశ్వవిద్యాలయంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు.

కాగా నెల రోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతుండడంతో మనస్థాపానికి గురై శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో తాను పనిచేస్తున్న విశ్వవిద్యాలయ వద్ద గేటుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేపడుతున్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

బన్సీలాల్ పేట్, ఏప్రిల్ 4: పద్మారావు నగర్ హమాలీబస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యకరమైన పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. తద్వారా ఆరోగ్యవంతులైన పిల్లలు జన్మనిస్తారని అన్నారు. క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదిస్తూ వారి సూచనలు పాటించాలని కోరారు. అంగన్ వాడీ టీచర్లు కుల్సుం, జానకి, తల్లుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పద్మ కాలనీలో ఎమ్మెల్యే పర్యటన

ముషీరాబాద్: అడిక్ మెట్ డివిజన్ పద్మకాలనీలో శుక్రవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పర్యటించారు. వరద నీరు చేరడంతో కాలనీ జలమయమైంది. వరద నీరు ఇళ్లలోకి చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అధికారుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. మునుముందు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే నాలా వర్క్స్ పూర్తి అయ్యాయని, త్వరలో వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు.